క్లుప్తంగా

రైతులకు దుబ్బు గుళికలు అంటగడితే చర్యలు

పద్మనాభం: మండలంలోని ఎరువులు అమ్మే డీలర్లు యూరియాతో పాటు దుబ్బు గుళికలు రైతులకు బలవంతంగా అంటగడితే సంబంధిత డీలర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంపీఎస్ చలం హెచ్చరించారు. దుబ్బు గుళికలు కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామని డీలర్లు రైతులను బలవంతం చేయకూడదన్నారు. యూరియాతో దుబ్బు కుళికలు కొనాలని బలవంతం చేసే డీలర్ల లైసెన్సు రద్దు చేస్తామని తెలిపారు. కావాలనుకున్న రైతులకు మాత్రమే దుబ్బు గుళికలు ఇవ్వాలని తెలిపారు. ఎరువులను ఎమ్మార్పీ ధరకు మాత్రమే అమ్మాలన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు చేయూత



అనాథలకు భోజనం వడ్డిస్తున్న చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు బోయిపాలెం సమీపంలో జేఎన్ఎన్‌యూఆర్ఎం పరదేశిపాలెం – 1 కాలనీలో గ్రేస్ హ్యాపీనెస్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు దివ్యాంగులు, వృద్ధులకు చేయూత అందించారు. సంస్థ నిర్వాహకులు పి.రత్నం ఆహారంతో పాటు అనాథ శరణాలయానికి నిత్యావసర సరకులు అందజేశారు.

వైభవంగా రాధాష్టమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్‌లో గల ఇస్కాన్ మందిరంలో ఆదివారం రాధాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ఆధ్వర్యంలో వేకువజామున వేడుకలు ప్రారంభమయ్యాయి. మంగళహారతి, దర్శనహారతి, హరినామ సంకీర్తన, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక కుంకుమార్చన చేశారు. రాధా కృష్ణ లీలలపై ప్రత్యేక ప్రవచనాలు అనంతరం భక్తులకు విందు ప్రసాదం అందించారు.


71 మందికి ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెంలో ఆదివారం ఓఎస్‌జీ ఫౌండేషన్, శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో పోతిన అప్పారావు జ్ఞాపకార్థం పోతిన సాయికుమార్ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 71 మందికి పరీక్షలు నిర్వహించారు. నగరపాలెం గ్రామ సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో 32 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వీరికి 2వ తేదీన నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు సీహెచ్ గిరిజ, క్యాంప్ కో ఆర్డినేటర్ వెంకటరమణ, సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, చంద్రశేఖర్, వాండ్రాసి సతీష్, , తమ్మిన నరేంద్ర, తమ్మిన గోపి, జగదీష్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన అదరహో..



శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆద్యంతం అలరించింది. మహా గణపతిం కీర్తనకు చేసిన నృత్యంతో కార్యక్రమం ప్రారంభమైంది. కళాకారులు ఆకాంక్ష, హాసిని, దీక్ష, భవ్య, రాణి, సంజన, మనవిత, నవ్య తదితరులు నృత్యం చేయగా... మురళీ గోవింద్ నృత్య దర్శకత్వం వహించారు.

అవసాన దశలో.. దివ్యాంగుల ఐటీఐ



వెల్డింగ్ వర్క్‌షాపులో మూలకు చేరిన మూడు చక్రాల సైకిళ్లు



శిథిలావస్థలో దివ్యాంగుల ఐటీఐ కార్యాలయ భవనం

- శిథిల భవనంలో కార్యాలయం
- ప్రస్తుతం శిక్షణ పొందుతున్నది 14 మందే
- పెయింటింగ్ ట్రేడ్ పట్ల ఆసక్తి కనబరచని విద్యార్థులు

పీఎం పాలెం: ఆంధ్రప్రదేశ్ విభిన్న **ప్రతిభావంతులు**, వయో వృద్ధులు, దివ్యాంగుల **శిక్షణ కేంద్రం** ప్రస్తుతం అవసాన దశలో కొట్టు **మిట్టాడుతోంది**. పైన పేర్కొన్న వారి ఉద్ధరణే **ధ్యేయంగా** 1985లో ఈ కేంద్రం అవతరించింది. **సుమారు** 23 ఎకరాల విస్తీర్ణంలో అప్పట్లో **దీన్ని నెలకొల్పారు**. ఏడాది కోర్సులైన కార్పెంటర్, వెల్డింగ్, షీట్ మెటల్ ట్రేడ్లలో ఇక్కడ సమగ్ర శిక్షణ ఇస్తారు. ప్రవేశ అర్హత 8వ తరగతి ఉత్తీర్ణత కాగా రెండు సంవత్సరాల ట్రేడ్ అయిన పెయింటింగ్‌లో శిక్షణకు 10వ తరగతి ఉత్తీర్ణత అవసరం. కార్పెంటర్ అభ్యర్థుల సంఖ్య 24 మంది కాగా మిగతా ట్రేడ్లలో 20 మంది చొప్పున 84 మందికి ఇక్కడ శిక్షణ లభిస్తోంది. అంత మంది అభ్యర్థులకు గాను కేవలం 14 మంది మాత్రమే ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. ఆగస్టు 30వ తేదీన జరిగిన కౌన్సెలింగ్‌లో మరో 13 మంది ప్రవేశ అర్హత సాధించారని ఐటీఐ ప్రిన్సిపాల్ జి. అన్నపూర్ణ తెలిపారు. పెయింటింగ్ ట్రేడ్‌లో చేరడానికి ఒక్క విద్యార్థి కూడా ఆసక్తి కనబరకపోవడం విశేషం.

వెల్డింగ్ కోర్సుపై ఆసక్తి..

ప్రస్తుతం వెల్డింగ్ నిపుణులకు మంచి డిమాండ్ ఉంది. సమగ్రంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు సొంతంగా వెల్డింగ్ షాపులు పెట్టుకుని ఉపాధి పొందుతున్నారు. మరో నలుగిరికి పని కల్పించగలుగుతున్నారు. వెల్డింగ్ కార్మికులకు రూ. వెయ్యి వరకూ దినసరి వేతనం లభిస్తోంది. **దేశ విదేశాల్లో కూడా డిమాండ్ ఉండటంతో చాలా మంది ఆ ట్రేడ్‌లో శిక్షణ పొందడానికి ఆసక్తి చూపుతున్నారు.** మిగతా ట్రేడ్ల పట్ల అంతగా ఆసక్తి చూపడం లేదని ఇన్‌స్ట్రక్టర్ నాగరాజు తెలిపారు.

శిథిలావస్థలో కార్యాలయ భవనం..

ప్రిన్స్‌పాల్‌తో కలిపి ఏడుగురు సిబ్బంది ఉన్న దివ్యాండుల ఐటీఐ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇది కూలడానికి సిద్ధంగా ఉంది. ఇంత కంటే మెరుగైన మరో భవనం లేకపోవడంతో ఈ భవనంలోనే బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తించవలసి వస్తోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతినెలా కంటింజెంట్ సొమ్ము అందజేయాలి..



దివ్యాంగుల ఐటీఐలో శిక్షణ పొందే విద్యార్థులకు స్నానపు సబ్బు, కొబ్బరి నూనె, దుస్తులు ఉతుక్కోవడానికి బట్టల సబ్బులు తదితర అవసరాల కోసం ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రూ.250 అందజేస్తుంది. అయితే ఏ నెలకు ఆ నెల కాకుండా రెండు మూడు నెలలకు ఇకసారి ఇస్తున్నారు. దీంతో అవసరమైన వస్తువులు కొనుక్కోవడానికి చేతిలో చిల్లిగవ్వ ఉండడంలేదు. ఇప్పటికైనా ప్రతినెలా కంటింజెంట్ నగదు చెల్లించాలి.

– ఎం. రూపేష్, దివ్యాంగ విద్యార్థి



సైగలతో థియరీ బోధిస్తున్న ఇన్‌స్ట్రక్టర్ నాగరాజు

కాంపౌండ్ వాల్ నిర్మించాలి..

23 ఎకరాల స్థలంలో విస్తరించి ఉన్న దివ్యాంగుల ఐటీఐ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలి. ఇది రోడ్డు కంటే పల్లంలో ఉంది. మెరక చేయాల్సి ఉంది. ఇక్కడ విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతో పాటు పడుకోవడానికి ఇనుప మంచాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

– జి. అన్నపూర్ణ, దివ్యాంగుల ఐటీఐ ప్రిన్సిపాల్

ఎరువుల షాపు యజమానికి హెచ్చరిక



రెడ్డిపల్లిలోని వెంకటరావు ఎరువుల షాపు

తగరపువలస: పద్మనాభం మండలం రెడ్డిపల్లిలోని అనుమోలుశెట్టి వెంకటరావు ఎరువుల షాపునకు వ్యవసాయశాఖ అధికారులు వార్నింగ్ ఇచ్చి మెమో జారీ చేశారు. యూరియా బస్తాపై పేర్కొన్న ఎంఆర్‌పీ ధర రూ.266.50 పైసలకు మాత్రమే రైతుకు విక్రయించాలన్నారు. గుళికలు కొంటేనే యూరి యా విక్రయిస్తామని రైతులకు షరతులు విధించకూడదన్నారు. యూరియా, దుబ్బు గుళికలకు ముడిపెట్టి విక్రయాలు జరిపితే ఎరువుల లైసెన్సు రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెబుతూ మెమో జారీ చేశారు.

రుద్ర గౌరీదేవికి డాక్టరేట్



రుద్ర గౌరీదేవికి డాక్టరేట్ అందిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

పద్మనాభం: మండలంలోని రేవిడి పంచాయతీ రౌతులపాలెం గ్రామానికి చెందిన కోన రుద్ర గౌరీదేవికి డాక్టరేట్ లభించింది. గ్రంథాలయ సమాచార శాస్త్ర విభాగంలో పరిశోధన చేసినందుకు డాక్టరేట్ అందుకున్నారు. ఏయూ వీసీ ఆచార్య సి.పి.రాజశేఖర్ చేతుల మీదుగా రుద్ర గౌరీ దేవి శనివారం అవార్డు అందుకున్నారు. ఈ పరిశోధనను ఆచార్య ధనరాజు పర్యవేక్షించారు.

త్రిశక్తి ఆలయ పుష్కర వేడుకలు నేడు





ఆలయంలోని ఎర్నమ్మ, ముస్తాబైన కొమ్మాది జంక్షన్‌లోని త్రిశక్తి ఆలయం

మధురవాడ: కొమ్మాది జంక్షన్‌లో కొలువైన మధురవాడ ప్రాంత 14 గ్రామాల ఆరాధ్య దేవతలు శ్రీ బంగారమ్మ, ఎర్నమ్మ, దుర్గ దండుమారమ్మ అమ్మవార్ల 12వ ఆలయ వార్షికోత్సవాలు సోమవారం జరగనున్నాయి. ఇప్పటికే ఆలయ కమిటీ ప్రత్యేక పూజల కోసం ఏర్పాట్లు చేసింది. వేడుకల కోసం ఆలయం ముస్తాబైంది. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 5 గంటలకు మేలుకొలుపు, 7 గంటలకు అమ్మవార్లకు పంచామృత, సుగంధ, ఫలోదక, అనేక పవిత్ర నదీ జలాలతో అభిషేకం, ప్రత్యేక పూజల జరగనున్నాయి. మధ్యాహ్నం 12 నుంచి ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కోతకు గురవుతున్న తీరం





బోయివీధి సమీపంలో రోడ్డు వరకు కోతకు గురువుతున్న తీరం

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులో తీరం అలల తాకిడికి కోతకుగురవుతోంది. ఇక్కడి బీచ్ పార్కు వద్ద నుంచి మత్స్యకారులు నివసించే బోయివీధి వరకు తీరం లోతట్టుగా ఉంటుంది. అందువల్ల అక్కడ తుపాన్లు, భారీ వర్షాలు పడే సమయాల్లో అలలు ఉధృతంగా ముందుకు వచ్చి తీరాన్ని తాకడంతో అది కోతకు గురువుతోంది. చాలా కాలంగా ఈ సమస్య ఉండగా అధికారులు సిమెంట్ దిమ్మలు, పెద్ద రాళ్లు వేసి తాత్కాలిక చర్యలు తీసుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పుడు వర్షాలు భారీగా పడుతున్న నేపథ్యంలో మళ్లీ తీరం అలల తాకిడితో కోతకు గురువుతోంది. మరికొద్ది రోజులు ఇలాగే జరిగితే పక్కనే ఉన్న రోడ్డు కూడా కోసుకుపోయి మత్స్యకారుల నివాసాల వరకు కోత ఏర్పడనుంది. దీంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు ఇక్కడ వెంటనే పటిష్టమైన రక్షణ గోడ నిర్మిస్తున్నట్టు అధికారులు ప్రకటనలు చేస్తున్నా ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు. పరిస్థితులను అర్థం చేసుకుని ఇప్పటికైనా రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

విభిన్న రూపాల్లో గణనాథుడు



చంద్రంపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీలో ఆదిశేషు అలంకరణలో గణనాథుడు



మిథిలాపురి ఉడా కాలనీ రోడ్డులో గణపతి



మద్దిలో వినాయకుడిని ఊరేగిస్తున్న దృశ్యం

మధురవాడ: మధురవాడ పరిసర ప్రాంతాల్లో పార్వతీ తనయుడు విఘ్ననాథుడు విభిన్న రూపాల్లో పూజలందుకుంటున్నాడు. జీవీఎంసీ 7వ వార్డు నగరంపాలెం రోడ్డు ఆదిత్యనగర్‌లోని మండపం వద్ద ఆదివారం దీపారాధన చేశారు. పరిసర ప్రాంతాల మహిళలు విశేషంగా తరలి వచ్చారు.

ఆకట్టుకున్న మంచునాథుడు

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డు 4వ వార్డు కాపులుప్పాడ పరిధి గొల్లలపాలెంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఐస్‌తో శివలింగాన్ని ఏర్పాటు చేసి చుట్టూ దీపాలంకరణ చేశారు. జీపీఎల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు దీపారాధన సేవ చేశారు.

భారీ గణనాథునికి పూజలు

మధురవాడ: చంద్రంపాలెంలో నందన ప్రియ వినాయక పేరుతో కొలువైన 41 అడుగుల భారీ గణనాథునికి వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), స్థానిక నాయకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధురవాడ, భీమిలి నియోజకవర్గానికి చెందిన నాయకులతో కలిసి చంద్రంపాలెం, పరదేశిపాలెం గ్రామాల్లో కొలువైన వినాయక మండపాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా మండపాల నిర్వాహకులు శాస్త్రోక్తంగా స్వాగతం పలికి సత్కరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

పద్మనాభం: మద్దిలోని కనకల వీధిలో నిలిపిన వినాయక విగ్రహ నిమజ్జనం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. వినాయకుడిని ట్రాక్టర్‌పై కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి రాజు వెంకటపతి రాజు చెరువులో నిమజ్జనం చేశారు.



మంచుతో ఏర్పాటు చేసిన శివలింగం



నగరంపాలెం రోడ్డులోని ఆదిత్యనగర్‌లో దీపారాధన



గణపతి మండపంలో వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

గణపతి సన్నిధిలో అన్నసమారాధనలు



చిట్టివలస కార్మికవాడలో అన్నదానం ప్రారంభిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు రామునాయుడు

మధురవాడ: జీవీఎంసీ 5, 7 వార్డుల పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం విస్తృతంగా అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. మధురవాడ మిథిలాపురి ఉడా కాలనీలోని ఆదిత్య ఫార్చ్యూన్ గేటెడ్ కమ్యూనిటీలో ఆదిత్య ఫార్చ్యూన్ టవర్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2 వేల మందికి అన్నదానం చేశారు. అయ్యప్ప నగర్, సద్గురు సాయినాథ కాలనీ, పరదేశిపాలెం, వైఎస్సార్ కాలనీల్లో 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నదానం ప్రారంభించారు. ఆయా మండపాల ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అన్నప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు

పాత పీఎం పాలెంలో

పీఎం పాలెం: వినాయక చవితి ముగింపు ఉత్సవాలలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు పాత పీఎం పాలెంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భీమిలి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చిన్న శ్రీను పాల్గొని అన్న ప్రసాదాలు స్వకరించారు. సాయంత్రం మేళతాళాలు, మహిళల కోలాటం, ప్రత్యేక వాయిద్యాల నడుమ గణపతి నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పోతిన శ్రీనివాసరావు, వెంకటరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అన్నప్రసాదం స్వీకరిస్తున్న మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

కార్మికవాడ, టీచర్స్ కాలనీలో..

తగరపువలస: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జీవీఎంసీ భీమిలి జోన్, భీమిలి, ఆనందపురం మండలాల్లో పలుచోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు. చిట్టివలస కార్మికవాడలో గుజ్జు పైడి సూరిబాబు ఆధ్వర్యంలో భారీ అన్నదానాన్ని పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు ప్రారంభించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు చిప్పాడ సూర్యనారాయణ తదితరులు సహాయ సహకారాలు అందించారు. ఆదర్శనగర్ టీచర్స్ కాలనీలో కూడా భారీ అన్నసమారాధన జరిగింది.

ఊపిరితిత్తుల వ్యాధులపై అవగాహన



శిక్షణలో పాల్గొన్న దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వైద్యులు

ఎంవీపీకాలనీ: ఊపిరితిత్తుల వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో కీలకమైన ఈబీయూఎస్ (ఎండోబ్రాంకియల్ అల్ట్రాసౌండ్) టెక్నాలజీపై మెడికవర్ హాస్పిటల్‌లో ఆదివారం శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. మెడికవర్ హాస్పిటల్స్, ఒలింపస్ మెడికల్ సిస్టమ్స్ సంయుక్తంగా దేశవ్యాప్తంగా ఉన్న పల్మనాలజీ నిపుణుల కోసం ఈ శిక్షణను నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ పల్మనాలజిస్టులు డాక్టర్ ప్రేమ్ కుమార్, డాక్టర్ సుధీర్ థాలే మాట్లాడుతూ మానవులను వేధిస్తున్న వ్యాధుల్లో ఊపిరితిత్తుల వ్యాధులు ముఖ్యమైనవని పేర్కొన్నారు. ఈ సమస్యపై అవగాహన పెంచేందుకు ఈ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా నిపుణులు సిద్ధాంతాలు, చికిత్స విధానాలు, వినియోగాలు, ప్రాథమిక సూత్రాలను వివరించారు. కార్యక్రమంలోపలువురు వైద్యులు పాల్గొన్నారు.

ముగ్గురు పేకాటరాయుళ్లపై కేసు నమోదు

తగరపువలస: ఆనందపురం మండలం బంటుపల్లి కళ్లాల శివారు కొబ్బరితోటలో ఆదివారం బహిరంగంగా పేకాట(కోత ఆట) ఆడుతున్న ముగ్గురు వ్యక్తులపై ఎస్ఐ బి.శివ ఏపీ గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. వీరి నుంచి రూ.1520 నగదు స్వాధీనం చేసుకున్నారు.

భవనం పైనుంచి పడి కార్మికురాలి మృతి



మృతి చెందిన చెందక సత్యాలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో నిర్మాణంలో ఉన్న ఓ భవనం పైనుంచి జారిపడి కార్మికురాలు మృతి చెందింది. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పీఎం పాలెం సీఐ జి. బాలకృష్ణ తెలిపిన వివరాలివి. విజయనగరం జిల్లా, గుర్ల మండలం, గొలగాం గ్రామానికి చెందిన చెందక సత్యాలు (48), తన భర్త సింహాచలంతో కలిసి మూడేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం విశాఖ వచ్చారు. వారు ఆరిలోవలోని తోటగరువు వద్ద నివాసం ఉంటూ భవన నిర్మాణ కూలీలుగా పనిచేస్తున్నారు. రుషికొండలోని తారకరామ లేఅవుట్‌లో గల ఆదిత్య అపార్ట్‌మెంట్ వెనుక నిర్మాణంలో ఉన్న ఒక భవనం వద్ద వారు కూలి పనులు చేస్తున్నారు. ఆదివారం మూడో అంతస్తులో శ్లాబ్ నిర్మాణ పనులు జరుగుతుండగా, పనిలో భాగంగా పైనున్న సత్యాలు కళ్లు తిరిగి మొదటి అంతస్తు శ్లాబ్‌పై పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. భర్త సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గణపయ్యకు 1200 లడ్డూల నైవేద్యం



లడ్డూ నైవేద్యం అందుకున్న గణపయ్య

కొమ్మాది: స్థానిక అన్నం రాజునగర్‌లో గల శ్రీ మంగళగౌరీ సమేత వైశాఖేశ్వరస్వామికి 1200 లడ్డూలను నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణమూర్తి, రమాదేవి దంపతులు, ఆలయ అర్చకులు నేతేటి చక్రధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపం వద్ద ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ సంతపేట రెడ్డివీధి గణపతి మండపం వద్ద ఆదివారం సాయంత్రం నిర్వాహకులు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు అందించారు. న్యాయనిర్ణేతగా సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్ ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు వ్యవహరించారు. పెద్ద ఎత్తున మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డీఎస్పీ నాగేశ్వరరావుకు ఘన సత్కారం



నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఎస్పీ మధుసూదనరావు

కొమ్మాది: విశాఖపట్నం మెరైన్ డీఎస్పీగా పని చేస్తున్న బి. నాగేశ్వరరావు పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆదివారం ఎండాడలో ఆయన్ని విశాఖ కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మధుసూదనరావు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన బి. నాగేశ్వరరావు సుమారు 44 సంవత్సరాలు సుదీర్ఘకాలం పోలీసు శాఖకు విశిష్టమైన సేవలు అందించారన్నారు. విధి నిర్వహణలో ముక్కుసూటిగా వ్యవహరించి పోలీసుశాఖ ప్రతిష్టను ఇనుమడింపజేశారన్నారు. అనంతరం డీఎస్పీ నాగేశ్వరావు దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు బహూకరించి వీడ్కోలు పలికారు.